క్లుప్తంగా

నేడు దోర్నాలలో మంత్రి సురేష్ పర్యటన

- చిన్న గుడిపాడులో గడప గడపకు మన ప్రభుత్వం

పెద్దదోర్నాల: పెద్దదోర్నాల మండలంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ శుక్రవారం పర్యటిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంటా రమణా రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 10 గంటలకు శ్రీశైలం రోడ్డులోని హరిత హైవే రిసార్ట్‌లో సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారని పేర్కొన్నారు. సాయంత్రం 3 గంటలకు మండల పరిధిలోని చిన్నగుడిపాడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

నేడు వైద్య శిబిరం

కంభం: అయ్యప్పస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఉదయగిరి మల్లికార్జున గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యశిబిరంలో బీపీ, సుగర్, ఈసీజీ, కంటికి సంబంధించిన వైద్యులు పాల్గొని పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చిరుధాన్యాలపై అవగాహన పెంచాలి

తాళ్లూరు: చిరుధాన్యాలపై గ్రామీణులకు అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన పెంచాలని వక్తలు అన్నారు. చిరుధాన్యాల సంవత్సరాన్ని పురస్కరించుకుని చిరుధాన్యాలతో తయారు చేసిన పలు పదార్థాలను స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రదర్శించారు. ప్రభుత్వం అంగన్‌వాడీ ద్వారా అందిస్తున్న పౌష్టికాహారంతో పాటు చిరుధాన్యాల్లో లభించే పీచు పదార్థాలు, ప్రొటీన్లు, విటమిన్లు, ఖనిజ లవణాల గురించి ఏపీ ఏడీ ఎగ్రాయిమ్, వ్యవసాయాధికారి ప్రసాదరావు వివరించారు. ముఖ్యంగా ఐరన్, రక్తహీనతతో బాధపడే వారికి ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. అనంతరం చిరుధాన్యాలతో చేసిన పదార్థాలను అంగన్‌వాడీలు భుజించారు. సూపర్‌వైజర్లు జ్యోతి, హేమలత, సునీత, నాగమణి, ఆనందలత పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

మార్కాపురం: తన భర్త రంగారెడ్డి బుధవారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని పట్టణంలోని వెంకచ్చమ్మ గుడి దగ్గర నివాసం ఉండే లక్ష్మి గురువారం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు ఎస్‌ఐ శశికుమార్ తెలిపారు. ఆర్థిక లావాదేవీలే తన భర్త మిస్సింగ్ కావడానికి కారణమై ఉండొచ్చని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

దర్శి: మండలంలోని కట్టసింగన్నపాలెం పరిసర ప్రాంతాల్లో పేకాట ఆడుతున్న ఏడుగురిని ఎస్‌ఐ రామకృష్ణ గురువారం రాత్రి అరెస్టు చేశారు. వారి నుంచి రూ.16,200 నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

జేఈఈ మెయిన్స్‌లో వివేక్‌రెడ్డి ప్రతిభ


వివేక్‌రెడ్డి

కురిచేడు: జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో 98.89 శాతం మార్కులు సాధించి టాపర్‌గా నిలిచాడు కాటం వివేక్‌రెడ్డి. మండలంలోని కాటం వారిపల్లెకు చెందిన కాటం రమణారెడ్డి, కోటేశ్వరమ్మల మొదటి సంతానం వివేక్‌రెడ్డి మొదటి నుండి విద్యాభ్యాసంలో మొదటి స్థానంలో నిలుస్తున్నాడు. పదో తరగతిలో 10కి 10 ర్యాంకు సాధించాడు. ఇంటర్‌లో 470 కి 461 మార్కులు సాధించాడు. జేఈఈ మెయిన్స్‌లో కూడా అదే ప్రతిభనుకనబరిచి టాపర్‌గా నిలిచి మండలానికి మంచి పేరు సంపాదించాడని పలువురు కొనియాడుతున్నారు. కాటం రమణారెడ్డి సీఆర్‌పీఎఫ్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు.

రామాలయం పునర్నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న నిర్వాహకులు

పొదిలి రూరల్: పట్టణంలోని విరాట్ నగర్‌లో ఉన్న రామాలయం శిథిలావస్థకు చేరడంతో గురువారం రామాలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తొలుత ఆలయాన్ని పూర్తిగా తొలగించి వేదపండితుల మంత్రోచ్ఛరణతో ప్రత్యేక పూజలు నిర్వహించి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా విరాట్ నగర వాసులు మాట్లాడుతూ దేవుని దయతో, దాతల సహకారంతో ఆలయాన్ని అందంగా నిర్మించుకుంటామన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, నిర్వాహకులు చొడ లక్ష్మీనారాయణ, పులుకూరి నాగేశ్వరరావు, బ్రహ్మం, కోటయ్య, మల్లి పాల్గొన్నారు.

ప్రమాదం అంచున ప్రయాణం


ట్రక్ ఆటోలో ప్రమాదకరంగా వెళ్తున్న కూలీలు


ఆటోలో పరిమితికి మించి వెళ్తున్న మహిళలు

కొనకనమిట్ల: ప్రస్తుతం వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి. తమ గ్రామాల నుంచి వేరే గ్రామాలకు పనుల కోసం వెళ్లి మళ్లీ గమ్యస్థానాలకు త్వరగా చేరాలనే ఉద్దేశంతో కూలీలు ఆటో, ట్రక్కు ఆటో, మినీ వ్యాన్‌లు, ట్రాక్టర్లలో ప్రయాణం చేస్తున్నారు. ఆటోల్లో పరిమితికి మించి ఎక్కించుకోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో ఆందోళనగా ఉంది. ఆటోలో 25 మంది కూలీలను కూడా ఎక్కించుకుంటున్నారు. అనుభవం లేని డ్రైవర్ల తప్పిదాలతో ప్రమాదాలకు గురవుతున్నారు. పాఠశాలల విద్యార్థులు సమయానికి బస్సులు లేక ఆటోల్లో పాఠశాలలకు వెళ్తున్నారు. గతంలో విద్యార్థులు ప్రయాణించే ఆటోలు తిరగబడి విద్యార్థులు గాయపడిన సంఘటనలు అనేకం ఉన్నాయి.


విద్యార్థులు ఇలా..

ఎంపీపీపై టీడీపీ నేతల ఆరోపణలు దురదృష్టకరం


మాట్లాడుతున్న మురారి, శ్రీనివాసరెడ్డి

తర్లుపాడు: దొంగే దొంగన్న చందంగా తెలుగుదేశం పార్టీ నేతలు చేసిన వ్యాఖ్యలను వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు ఖండించారు. తెలుగుదేశం పాలనలో ఎకరాలకు ఎకరాలు ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం చేసిన నేతలే నేడు ఎంపీపీ భూలక్ష్మిపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గురువారం మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. మురారి మాట్లాడుతూ కొంత కాలంగా మండలంలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో బీసీలను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డిపై ఆయన చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలు దురదృష్టకరమన్నారు. మంగళకుంట, లక్ష్మక్కపల్లె గ్రామాల్లో సుమారు 500 ఎకరాల భూమి అన్యాక్రాంతమైందన్నారు. టీడీపీ మద్దతుదారులు బినామీలతో ప్రభుత్వ భూములు చెరబట్టారన్నారు. విలువలతో కూడిన రాజకీయాలు చేయాలని సూచించారు. ఎంపీపీ భూలక్ష్మిపై టీడీపీ నేత చిన్నపరెడ్డి చేసిన ఆరోపణల్లో నిజం లేదని పోతలపాడు సర్పంచ్ శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. సర్పంచ్‌లు పెద్ద మస్తాన్, రసూల్, రమణరెడ్డి, పి.వరాలు, ఎంపీటీసీ పార్వతి రమేష్‌రెడ్డి, అంకమ్మ, వైస్ సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, నాయకులు రామసుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, గుమ్మా రాజేంద్రప్రసాద్, ఎబినేజర్, రమేష్, ఇంద్ర పాల్గొన్నారు.

ఖాజీగా హిదయతుల్లా నియామకం


హిదయతుల్లాకు ఖాజీ నియామక పత్రాన్ని అందజేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: స్థానిక జామియా మసీదు మౌలానా హిదాయతుల్లాను పుల్లలచెరువు మండల ఖాజీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం వైపాలెంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషా, వివిధ మసీదుల మౌలానాలు అష్రాఫ్‌అలీ, జుబేర్, మొహమ్మద్ హుస్సేన్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కె.ఓబుల్‌రెడ్డి, షేక్ కాశింబాషా పాల్గొన్నారు.

శివరాత్రికి ముస్తాబైన పంచకోవెల ఆలయాలు


పంచకోవెల దేవాలయ ప్రాంగణం

పొదిలి రూరల్: భక్తి తత్వాన్ని పెంపొందించి..మనస్సుకు పవిత్ర భావాన్ని చేకూర్చి తద్వారా మానసిక ప్రశాంతతను అందించే దేవాలయాలు పొదిలి పంచకోవెల దేవాలయాలు. రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన ఈశ్వరుని దేవాలయాల్లో పొదిలిలోని పార్వతీదేవి సమేత నిర్మమహేశ్వర స్వామి దేవాలయం ఒకటి. ఈ శివాలయానికి ఒక ప్రత్యేకత ఉంది. దీన్నే దక్షిణ కాశిగా పిలుస్తారు. శివాలయంలో మూడు ఎకరాలకు పైగా ఉన్న సువిశాలమైన ప్రాంగణంలో ఐదు దేవాలయాలతో పాటు నవగ్రహాలు, నాగేంద్రుని పుట్ట, యజ్ఞశాలలు ఉన్నాయి. పంచకోవెల ఆలయాలు పార్వతి సమేత నిర్మమహేశ్వర స్వామి ఆలయం, కామాక్షి సమేత కైలాసనాథ దేవాలయం, త్రిపుర సుందరీ సమేత భీమేశ్వరాలయం, శ్యామలాదేవి సమేత నగరేశ్వర స్వామి దేవాలయం, నిమ్మవ్వ గుడి ఉన్నాయి. ఈ దేవాలయాలన్నీ పది శతాబ్దాలు చరిత్ర కలిగినవి.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు!

పృథులాపురి పట్టణంలో వేంచేసి ఉన్న పార్వతీదేవి సమేత నిర్మమహేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 10వ తేదీ శుభకృత నామ సంవత్సరం మాఘ బహుళ పంచమీ శుక్రవారం నుంచి 23వ తేదీ ఫాల్గుణ శుద్ధ చవితి గురువారం వరకు జరుగుతాయని ఆలయ కార్యనిర్వాహణాధికారి బి.శ్రీనివాసరావు తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారు రోజుకు ఒక రూపంతో భక్తులకు దర్శనం ఇస్తారన్నారు.

విశ్రాంత ఉద్యోగి కుటుంబానికి ఎమ్మెల్యే అన్నా పరామర్శ


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అన్నా

గిద్దలూరు రూరల్: పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో విశ్రాంత ఉద్యోగి బెల్లం చంద్రశేఖర్ ఇటీవల అనారోగ్యం కారణంగా మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మృతిపై ఎమ్మెల్యే తీవ్ర సంతాపం తెలియజేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠకు హాజరైన ఎమ్మెల్యే అన్నా


ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

కొమరోలు: మండలంలోని యర్రంశెట్టివానిపల్లెలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో గిద్దలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాంబాబు కోదండరామస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. జెడ్పీటీసీ సభ్యుడు సారె వెంకటనాయుడు, వైస్ ఎంపీపీ షేక్ మౌలాలీ, వైఎస్సార్ సీపీ నాయకుడు వెంగయ్య చౌదరి పాల్గొన్నారు.

అర్జున్ నాయక్ సేవలు మరువలేనివి


అర్జున్ నాయక్‌ను సత్కరిస్తున్న వ్యవసాయాధికారులు

దర్శి: దర్శి వ్యవసాయ సహాయ సంచాలకులుగా పనిచేసిన అర్జున్ నాయక్ సేవలు మరువలేనివని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. దర్శి ఏడీఏగా పని చేసి పదోన్నతిపై ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రంలో అర్జున్ నాయక్‌కు వీడ్కోలు సభ నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ అర్జున్ నాయక్ అన్నీ బాధ్యతలు పశ్చిమ ప్రకాశంలోనే పూర్తి చేశారన్నారు. నీతి, నిజాయితీతో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించారని చెప్పారు. తదుపరి బాధ్యతలు కూడా సమర్థంగా నిర్వర్తించాలని ఆకాంక్షించారు. కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ సబ్‌డివిజన్ పరిధిలో అర్జున్ నాయక్ తనకెంతో సహకారం అందించారని చెప్పారు. ఉద్యోగంలో రైతులకు ఎనలేని సేవలందించి ప్రశంసలందుకున్నారని పేర్కొన్నారు. నాయక్ సేవలను వ్యవసాయ సహాయ సంచాలకులు పి.నిర్మలాదేవి కొనియాడారు. ఏఈలు, ఏఓలు, కృషి విజ్ఞాన కేంద్ర సిబ్బంది పాల్గొని అర్జున్ నాయక్‌ను పూల మాలలతో ఘనంగా సత్కరించారు.

కార్మికుల సంక్షేమం కోసం పుల్లయ్య కృషి


పుల్లయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మార్కాపురం: సీపీఎం సీనియర్ నేత, దివంగత ఏనుగుల పుల్లయ్య కార్మికుల సంక్షేమం కోసం కృషి చేశారని పశ్చిమ ప్రకాశం సీపీఎం నేత డీకేఎం రఫీ అన్నారు. గురువారం పుల్లయ్య 14వ వర్ధంతి సందర్భంగా హెడ్‌పోస్టాఫీస్ వద్ద ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రైతు సంఘ నేత గాలి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ పుల్లయ్య కార్మిక, కర్షక, బడుగు వర్గాల కోసం పోరాటాలు చేశారన్నారు. పుల్లయ్య ఆశయాలు కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు సోమయ్య, బాలనాగయ్య, హెడ్‌పోస్ట్‌మాస్టర్ కాశీంసాహెబ్, రుబెన్, రాజు, చెన్నకేశవులు పాల్గొన్నారు.

పుచ్చలో సస్యరక్షణ పద్ధతులు పాటించాలి


పుచ్చ పంటను పరిశీలిస్తున్న సంధ్య

పొదిలి రూరల్: పుచ్చ సాగు చేసే రైతులు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలని ఉద్యానశాఖ అధికారి డి.సంధ్య సూచించారు. మండలంలోని ఆముదాలపల్లిలో పుచ్చ సాగు చేసిన పొలాలను ఆమె గురువారం పరిశీలించారు. పుచ్చ సాగును డ్రిప్, మల్చింగ్ విధానంలో సాగు చేస్తే నీటి ఎద్దడి ఉండదని, కలుపు పెట్టుబడి తగ్గించవచ్చన్నారు. జిగురు అట్టలు వాడితే రసం పీల్చే పురుగులు, దోమల ద్వారా వ్యాప్తి చెందే వైరస్ తెగులను నివారించవచ్చన్నారు. 20–40 రోజులకు బోరాక్స్ రెండు గ్రాములు లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు. పూత సమయంలో నీరు అధికంగా వాడొద్దని చెప్పారు. ఆమె వెంట ఉద్యాన సహాయకులురాలు నర్మద, రైతులు ఉన్నారు.

శుభ్రమైన నీరు తాగాలి


వీల్‌చైర్లు, వాకర్లు పంపిణీ చేస్తున్న డాక్టర్లు

పొదిలి రూరల్: ఫ్లోరోసిస్ బారిన పడకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ సురక్షిత, స్వచ్ఛమైన నీరు తాగాలని జిల్లా ఫ్లోరోసిస్ అధికారి డాక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. గురువారం పొదిలి నగర పంచాయతీలోని రాజుపాలెం, నేతపాలెం గ్రామాల్లో ఆయన సందర్శించి ఫ్లోరోసిస్‌తో బాధపడుతున్న కొంతమందిని పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ క్యాల్షియం మాత్రలు, మల్టీ విటమిన్ మాత్రలు వాడితే సరిపోతుందన్నారు. అనంతరం ఫ్లోరోసిస్‌తో బాధపడుతున్న వారికి రెడ్‌క్రాస్, రోటరీ క్లబ్ వారు ఇచ్చిన వీల్‌చైర్లు, ప్రభుత్వం సరఫరా చేసిన వాకర్లు, వాకింగ్ స్టిక్స్ పంపిణీ చేశారు. ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుష్మ, హెల్త్ సూపర్‌వైజర్ నారు శ్రీనివాసరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ చౌడేశ్వరి, ఏఎన్‌ఎంలు మాధవి, భారతి శ్యామల ఉన్నారు.

మహిళా సంరక్షణ కార్యదర్శికి అవార్డు



ఎస్పీ నుంచి అవార్డు అందుకుంటున్న అశ్వని

గిద్దలూరు రూరల్: పట్టణంలోని నంద్యాల రోడ్డు సచివాలయంలో మహిళా సంరక్షణ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఎస్.అశ్వనికి ఎస్పీ మలికా గర్గ్ ఉత్తమ అవార్డు, ప్రశంస పత్రం అందజేశారు. జిల్లాలో మహిళా పోలీసులకు కేటాయించిన కొత్త టాస్క్‌లపై డిసెంబర్‌లో జిల్లా మొదటి స్థానం, జనవరిలో 5వ స్థానం వచ్చినందుకు అశ్వనికి ప్రశంస పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు ప్రశంసించారు.

ఆలయంలో ఎస్టీ కమిషన్ చైర్మన్ పూజలు


పూజలు చేస్తున్న కుంభా రవిబాబు

త్రిపురాంతకం: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాలాత్రిపుర సుందరీదేవి ఆలయంలో ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు, కమిషన్ సభ్యులు రామలక్ష్మి, మురళి, శంకర్ నాయక్, లిల్లి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ అర్చకుడు ప్రసాద శర్మ, ఈఓ చెన్నకేశవరెడ్డి, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పద్మజ మల్లికార్జున్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అధికారులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

మార్కాపురం టౌన్: పట్టణ శివారు మార్కెట్ యార్డ్ దగ్గర ఉన్న అభయాంజనేయస్వామి 9వ వార్షికోత్సవం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారికి ఉదయం అర్చన, అభిషేకం, ఆకు పూజలు చేశారు. అనంతరం రుద్రహోమం, హనుమంత, చండీహోమాలు వేదపండితులు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. గౌరవ అధ్యక్షుడు కుందూరి కృష్ణామోహన్‌రెడ్డి, అధ్యక్షులు ఎం.రామిరెడ్డి, యోగిరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ డీవీ కృష్ణారెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సుబ్బారావు

మార్కాపురం టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బీవీ సుబ్బారావు కోరారు. గురువారం స్థానిక పెన్షనర్ల భవనంలో జిల్లా సమావేశాన్ని అధ్యక్షుడు ఎస్.విశ్వరూపాచారి అధ్యక్షతన నిర్వహించారు. పెన్షనర్ల సంక్షేమానికి ప్రభుత్వం సహకరించాలని కోరారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు జి.రవీంద్రనాథ్‌రెడ్డి, పి.జయరామ్, మార్కాపురం యూనిట్ అధ్యక్షుడు డాక్టర్ ఐ. బాల సుబ్బారావు, నాగేశ్వరరావు, నారయణరెడ్డి, జిల్లాలోని వివిధ మండలాల విశ్రాంత ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

ముండ్లమూరు: గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటేనే తల్లీ,బిడ్డ క్షేమంగా ఉంటారని మారెళ్ల వైద్యాధికారి మధుశంకర్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభయాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు.

అంగన్‌వాడీల అభివృద్ధికి తోడ్పాటు


అంగన్‌వాడీ చిన్నారులతో సైదా

కురిచేడు: అంగన్‌వాడీల్లో చిన్నారులు అలవాటయ్యేందుకు ప్రభుత్వం అనేక రకాల ఆటవస్తువులు, పౌష్టికాహారం అందజేస్తోంది.దానికి ఉడుతా భక్తిగా గ్రామస్తులు సహకారం అందిస్తుండటంతో అంగన్‌వాడీల అభివృద్ధి సులభతరమవుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభాషిణి తెలిపారు. మండలంలోని 46 అంగన్‌వాడీ కేంద్రాలకు ఒక్కో కేంద్రానికి రెండు బబుల్స్ చొప్పున రాష్ట్ర ఫిషరీస్ బోర్డు అడ్వైజర్ షేక్ సైదా గురువారం అందజేశారు. మండలంలోని పడమరవీరాయపాలెం రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆ గ్రామస్తుడు, శ్రీ కరుణా వృద్ధాశ్రమం నిర్వాహకుడు మోతుకూరి కాశయ్య 20 పలకలు, 20 ప్లేట్లు, 20 గ్లాసులు అందజేశారు. అంగన్‌వాడీల అభివృద్ధికి తమ వంతు తోడ్పాటు అందించిన వారికి అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుభాషిణి, కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు.

పెట్రోల్ బంక్ ప్రారంభం


పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తున్న ఉడుముల

కొనకనమిట్ల: మండలంలోని చినారికట్ల జంక్షన్ సమీపంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉడుముల జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన హిందుస్థాన్ పెట్రోల్ బంక్‌ను గురువారం లాంఛనంగా ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, హిందుస్థాన్ పెట్రోలియమ్స్ నెల్లూరు డీజీఎం ఎస్.భాస్కర్‌రెడ్డిలు బంకును ప్రారంభించారు. ఉడుముల మాట్లాడుతూ నాణ్యమైన పెట్రోల్, డీజిల్ వినియోగదారులకు సరఫరా చేయాలన్నారు. ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ యాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, సొసైటీ చైర్మన్‌లు కామసాని వెంకటేశ్వరరెడ్డి, ఉడుముల శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎంపీపీ ఉడుముల రామనారాయణరెడ్డి, తర్లుపాడు ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, స్థానిక సర్పంచ్ అనూరాధ, ఎంపీటీసీ ఉడుముల ధనలక్ష్మి బంగారురెడ్డి, మాజీ సర్పంచ్ ఉడుముల గురవారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

88 బస్తాల రేషన్‌బియ్యం స్వాధీనం


బియ్యం బస్తాలు పరిశీలిస్తున్న డీఎస్పీ అశోక్‌వర్ధన్

మార్కాపురం టౌన్: మార్కాపురం రైల్వేస్టేషన్ సమీపంలోని వాసవీ మిల్లులో గురువారం దాడులు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన 88 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ డీఎస్పీ అశోక్‌వర్ధన్ తెలిపారు. రెండు రోజుల క్రితం టీసీపల్లి వద్ద బియ్యం లారీని స్వాధీనం చేసుకోగా వారు ఇచ్చిన సమాచారం మేరకు తాము మార్కాపురం వచ్చి దాడులు చేసినట్లు తెలిపారు. ఎస్సై వెంగల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కస్తూర్బా విద్యాలయం తనిఖీ


భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ, అధికారులు

దొనకొండ: స్థానిక కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాలను ఎంపీపీ బొరిగొర్ల ఉషా మురళి, తహసీల్దార్ కాలే వెంకటేశ్వరరావు, మండల విద్యాధికారి ఎస్.సాంబశివరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు వంటశాల, వాటర్ ప్లాంట్, పరిసరాలను పరిశీలించారు. ప్రత్యేకాధికారి అరుణకుమారితో మాట్లాడి ఇక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాము తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. లోపాలు ఉంటే తమకు తెలియజేయాలని తహసీల్దార్ కాలే వెంకటేశ్వరరావు సూచించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. వైద్యాధికారి సునీత బాలికలకు ఆరోగ్యపరమైన సూచనలందించారు. ప్రస్తుతం కేజీబీవీలో బాలికల ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉందని, ఎవరూ ఎలాంటి బెంగ పెట్టుకోకుండా చదువుకోవాలన్నారు. పాఠశాల ఆవరణలో చిల్ల చెట్లు ఉండటంతో విషపురుగులు, నీరు నిల్వ ఉండి దుర్వాసన వస్తోందని అధికారులు గమనించి యుద్ధప్రాతిపదికన చిల్లచెట్లు తొలగించారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా కాలువ మరమ్మతులు చేయించారు. వారి వెంట వీఆర్‌ఓ హరినారాయణ వున్నారు.